హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డ్ లక్ష్మణ్ ఇటీవల విధి నిర్వహణలో ప్రమాదానికి గురైయ్యాడు. లక్ష్మణ్ వైద్య ఖర్చుల నిమిత్త టౌన్ సిఐ బి.యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు ఆర్థిక సాయం చేయాలని భావించారు. దానికి అనుగుణంగా రూ.60 వేలు సేకరించారు. ఈ సాయాన్ని సోమవారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద చేతుల మీదుగా లక్ష్మణ్‌కు అందించారు. హోంగార్డుకు అండగా నిలిచిన టౌన్ పోలీస్ సిబ్బందిని డిఎస్‌పి శ్రీవేద అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ బి.యాదగిరి, ఎస్ఐ ముత్యాలరావు, కానిస్టేబుల్స్ మూర్తి, ఎన్.రాజేష్, ఎస్.చక్రి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న డిఎస్‌పి శ్రీవేద

చచ్చినా.. చావే..!

మండలంలోని పలు హిందూ, క్రైస్తవ, బిసి శ్మశానవాటికల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. ఏ శ్మశానవాటిక చూసినా తుప్పలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కనీసం కూర్చోవడానికి షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అంత్యక్రియలు చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లో శ్మశానాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. దశాబ్దాల క్రితం శ్మశానాలకు కేటాయించిన స్థలం సరిపోక ప్రజలు అంత్యక్రియలకు నానా పాట్లు పడుతున్నారు. చినుకు పడితే దుస్థితి వర్ణనాతీతం.

అంత్యక్రియలకు మృతదేహంతో పంట బోదె దాటి వెళ్తున్న కరుగోరుమిల్లి కాలనీవాసులు

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కరువు

అంత్యక్రియలకు ప్రజల అవస్థలు

కరుగోరుమిల్లి కాలనీ వాసుల పరిస్థితి మరింత దయనీయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలంలోని 12 గ్రామాల్లో 28 నోటిఫైడ్ హిందూ, క్రిస్టియన్, బిసి, శ్మశానవాటికలు ఉన్నాయి. ఒకటి అర మినహా ఎక్కడా శ్మశానాల్లో వసతులు లేని పరిస్థితి. వీటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే అయినా పూర్తిగా గాలికొదిలేశాయి. ఆచంటలో సంత సమీపంలోని పెదపేట శ్మశానవాటిక పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది. అంత్యక్రియలకు వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేని పరిస్థితి. వర్షాకాలంలో పంట బోదెను దాటుకుని శ్మశానవాటికకు వెళ్ళాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత టిడిపి హయాంలో 1.20 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. నిధులు పూర్తిస్థాయిలో విడుదలకాకపోవడంతో శ్మశావాటికలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రహరీ నిర్మాణం పనులు సైతం మధ్యలోనే నిలిచిపోయాయి. ఆచంట శివారు గోగులమ్మ పుంత, మానేవారిపాలెం వెళ్లే రహదారిలోని హిందూ శ్మశానవాటికలు రైతుల ఆక్రమణలకు గురయ్యాయి. వల్లూరులో శ్మశానవాటికకు స్థలం కొనుగోలు చేస్తామని టిడిపి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఫలితం లేదు. ఆచంట వేమవరంలో శ్మశాన స్థలం లేక సమీపంలోని నక్కల డ్రెయిన్ పరివాహక ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్న పరిస్థితి. కొడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, భీమలాపురం గ్రామాల్లోని శ్మశానవాటికల వద్ద షెడ్లు, వసతులు లేక అంత్యక్రియలు నిర్వహించడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కరుగోరుమిల్లి కాలనీ వాసుల పరిస్థితి దయనీయం..

కరుగోరుమిల్లి గ్రామ పరిధిలోని ముత్యాలవారిపాలెం ఎస్‌సి కాలనీ వాసుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కాలనీలో సుమారు 200 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వీరికి శ్మశానవాటిక లేదు. కాలనీలో ఎవరైనా చనిపోతే కర్మకాండలు నిర్వహించడానికి వారు పడే పాట్లు వర్ణనాతీతం. కాలనీ ఆనుకొని బ్యాంక్ కెనాల్ ఉంది. పంట కాలువపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేదు. దీంతో వారు బ్యాంక్ కెనాల్‌పై ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి సిమెంటు స్తంభాల మీదుగా మృతదేహాన్ని నెత్తిన పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ పంట కాలువ దాటి గోదావరి తీరానికి అంత్యక్రియలు నిర్వహించడానికి వెళ్తున్నారు. ఈ సందర్భంలో ఒకసారి పంట కాలువలోకి బోల్తా పడి గాయపడిన సందర్భాలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి శ్మశానవాటికల వద్ద సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డితోపాటు డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లాలో పలు ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన 168 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వృద్ధుల సంక్షేమ ట్రిపునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని సిఐటియు నాయకులు ఆంజనేయులు ప్రశ్నించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ బిల్లులు, వేతనాలు, బకాయిలు, కనీస వేతనాలు లేక, పెరిగిన ధరలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైస్కూళ్లల్లో ఐదుగురు పనిచేస్తే ముగ్గురికే వేతనాలు ఇస్తున్నారన్నారు. 9, 10 క్లాసుల విద్యార్థులను లెక్కల్లోకి తీసుకోకుండా 25 మందికి ఒక జీతం చొప్పున ఇస్తున్నారని, అవి కూడా బకాయి ఉన్నాయని తెలిపారు. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో పాత మెనూ ఛార్జీలనే అమలు చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులను అగాధంలోకి నెట్టేస్తున్నారన్నారు. కలెక్టరేట్లో కూడా వినతిపత్రం తీసుకోవడానికి ఏ జిల్లా అధికారీ అందుబాటులో లేరని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మదీనా బేబీ, నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఇఒ కార్యాలయ ఎడికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, సరళ, దున్న మరియమ్మ, గురజాల వరలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు బిఎల్ఒ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జెసికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీలకు బిఎల్ఒ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి కోరారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేసి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఫోన్ సపోర్ట్ చేయక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే పని భారంతో సెంటర్ల పని కుంటు పడుతోందన్నారు. ఆచంట, పెనుమంట్ర మండలాల్లో బిఎల్ఒ విధులు అంగన్‌వాడీలకు వేశామని, మీరు ఈ పని చేయాలని చేయకపోతే ఊరుకోబోమంటూ తహశీల్దార్లు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. మరో పక్క ఐసిడిఎస్ అధికారులు అంగన్‌వాడీలు ఐసిడిఎస్ పనులు తప్ప మరి ఏ ఇతర పనులూ చేయకూడదని చెబుతున్నారని, ఐసిడిఎస్ పరిధిలో పనులు తప్ప మరే ఇతర పనులు చేయకూడదని డైరెక్టేట్ నుంచి సర్క్యులర్ విడుదల చేశారని తెలిపారు. ఈ విషయాలన్నీ చెప్పి వినతులు ఇచ్చినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు పంపించి సెంటర్ల విజిట్‌ల పేరుతో ఇబ్బంది పెడుతున్నారన్నారు. స్పందించిన జెసి వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఆచంట, పెనుమంట్ర అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న అంగన్‌వాడీ నేత కళ్యాణి

కమిషన్ మూడు రూపాయలకు పెంచాలి

తహశీల్దార్‌కు రేషన్ డీలర్లు వినతి

ప్రజాశక్తి - భీమవరం

తమకిచ్చే రూపాయి కమిషన్ మూడు రూపాయలకు పెంచాలని కోరుతూ పాలకోడేరు తహశీల్దార్ ఎన్.భారతీ విజయలక్ష్మికి సోమవారం రేషన్ డీలర్స్ అసోసియేషన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్ల నుంచి రేషన్ షాపులు తమకు అప్పగించిన తర్వాత 65 దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ల వద్దకెళ్లి రేషన్ సరుకులను ప్రభుత్వ ఆదేశాల మేరకు సొంత ఖర్చులతో డోర్ డెలివరీ చేస్తున్నామని, ఇంతవరకూ తమకు ఎలాంటి రెమ్యునరేషన్ మంజూరు చేయలేదని తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం ఇస్తున్న కిలోకు రూపాయి కమిషన్ ఇప్పుడు కూడా ఇస్తున్నారని, పెరిగిన ధరల దృష్ట్యా మూడు రూపాయలకు పెంచాలని కోరారు. 15వ తేదీ వరకూ రేషన్ తీసుకోవచ్చుని, ప్రభుత్వం ప్రచారం చేస్తూ రోజు రోజుకూ పర్సంటేజీలు, టార్గెట్ పెడుతున్నారని, దీనివల్ల తమకు మానసిక ఒత్తిడి పెరిగిపోయిందని, ప్రశాంత వాతావరణంలో పంపిణీ చేసేలా పరిస్థితులు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయి రామకృష్ణ, విజయరత్నం, ఉష, సుజాత, హైమ, ఆనందం నాగలక్ష్మి, నవీన్, మునీశ్వరరావు, చినబాబు, జల్లూరి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

10న భీమవరంలో పింఛన్ అదాలత్ : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 10వ తేదీ ఉదయం పది గంటలకు భీమవరం ఎస్ఆర్‌కెఆర్‌కె ఆడిటోరియంలో ఎపి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ ఆధ్వర్యంలో పింఛన్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ సమావేశం అనంతరం జిల్లా అధికారులతో జెసి మాట్లాడారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉప కార్యాలయాలకు సమాచారం అందించి వారికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్‌కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పింఛను మంజూరు, జిపిఎఫ్, మిస్సింగ్ క్రెడిట్ సంబంధించి అన్ని సమస్యలను పింఛన్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చున్నారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

మృత్యు మార్గాలుగా ఆర్అండ్‌బి రహదారులు

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

రోడ్లు నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడండి

లేని పక్షంలో నవంబర్‌లో ఆందోళన చేపడతాం

సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాస్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - భీమవరం

వీరవాసరం మండలంలో ఉన్న ఆర్అండ్‌బి రహదారులు మృత్యు మార్గాలకు నిలయంగా ఉన్నాయని సిపిఎం జిల్లా నాయకులు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు కాపాడాలని నవంబర్ నెలలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆర్అండ్‌బి రోడ్లు నిర్మించాలని కోరుతూ సిపిఎం మండల కన్వీనర్ బొర్రా అలమహరాజు, మండల కమిటీ సభ్యులు తాలూరి హరిరామ లక్ష్మణ్ తో నరసింహమూర్తి ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాస్‌కు స్థానిక కలెక్టరేట్లో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అత్యంత దారుణంగా చెరువులను తలపించేలా అత్యంత ప్రమాదకరంగా నవుడూరు జంక్షన్ నుండి మడుగు పోలవరం లంక, వీరవాసరం-నవుడూరు-కొండేపూడి, తోలేరు - బాలేపల్లి ఆర్అండ్‌బి రోడ్లు నిర్మించాలన్నారు. 2020లో సిపిఎం ఆధ్వర్యంలో రోడ్లు వేసేంత వరకు గోతులను అయినా పూడ్చి ప్రమాదాలు జరగకుండా చేయమని అనేక ఆందోళనలు చేశామన్నారు. 2023లో నవుడూరు జంక్షన్ నుండి భీమవరం వరకు పాదయాత్రలు, మోటర్ సైకిల్లు ప్రచార యాత్రలు, నిరసన దీక్షలు, ధర్నాలు వంటి వివిధ రూపాల్లో ఆందోళన చేయగా నవుడూరు జంక్షన్ నుండి ముడుపు పోలవరం లంక వరకు 23 అడుగుల వెడల్పు పెంచి రోడ్డు వేయడానికి రూ.16 కోట్లు అంచనాతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారని గుర్తుచేశారు. 2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొదటిగా పోలవరం లంక రోడ్డు నిర్మిస్తామని భీమవరం ఎంఎల్ఏ పులపర్తి అంజిబాబు హామీ ఇచ్చినప్పటికీ 16 నెలలు గడిచిన హామీ అమలు కాలేదన్నారు. నవుడూరు, కొండేపూడి రోడ్లలో రోజు నాలుగు, ఐదు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హామీలు ఇవ్వడం తప్ప అమలు కావడం లేదని విమర్శించారు. చనిపోయాకో, చేతులు విరిగిపోయాకో పరామర్శకి రావడం తప్ప రోడ్లు వేసే చర్యలు అధికారులు, ప్రజా ప్రతినిధులు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈనెలాఖరుకు అన్ని రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్ మొదటివారంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఇఇకి వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా నాయకులు నరసింహమూర్తి

పోలీసుల ప్రేక్షక పాత్ర..!

కొట్లాటను నివారించడంలో విఫలం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో రెండు సామాజిక గ్రూపుల మధ్య దారితీసిన కొట్లాటను నివారించడంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారన్న ఆరోపణలు వెళ్లువెత్తుతున్నాయి. ఆ రెండు గ్రూపుల మధ్య కొట్లాటను నివారించడంలో పోలీసులు వైఫల్యం చెందడంతో రెండు గ్రూపుల వారు గాయాలపాలై ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడంతో వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఇరు గ్రూపులపై కేసులు నమోదు చేశారు. బాధితులమంటూ చెప్పుకుంటున్న వారు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 2వ తేదీ రాత్రి ఒక సామాజిక తరగతి వారు అమ్మవారిని ఊరేగిస్తున్నారు. ఈ ఊరేగింపుకు మత్స్యపురి వెళ్లే మార్గం వద్ద మరో సామాజిక గ్రూపుకు చెందిన యువకులు అభ్యంతరకరంగా ప్రవర్తించారు. ఆ సమయంలో గొడవను పెరగకుండా ఇరు గ్రూపులు సర్దుబాటు చేసుకున్నారు. ఊరేగింపు సంత మార్కెట్ వద్దకు వచ్చేసరికి మరోసారి ఇరు గ్రూపులు గొడవ పడటంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఊరేగింపును పర్యవేక్షిస్తూ వీడియో తీస్తున్నారు. ఈక్రమంలో ఊరేగింపు హైస్కూల్ వద్దకు చేరే సరికి ఊరేగింపు పట్ల ముందు నుండి అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తులకు మరికొంత మంది తోడై ఊరేగింపు నిర్వాహకులుగా ఉన్న తమపై ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారంటున్నారు. ఆ సమయంలో అక్కడ పోలీసులు ఉన్నప్పటికీ ప్రేక్షక పాత్ర వహించారని దాడికి గురైన వారు ఆరోపిస్తున్నారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటే ఈ కొట్లాట జరిగేది కాదని ఆ గ్రూపు వారి వాదన. గతంలో ఇదే సామాజిక గ్రూపుల మధ్య ఒక పాత గొడవ విషయంలో కేసు నమోదు జరిగిందని, ఆ కేసు విషయంలో రాజీకి రానందు వల్లే ముందస్తు పథకంతో ప్రస్తుతం తమపై దాడి కుట్ర జరిగిందని ఊరేగింపు నిర్వాహకులు అంటున్నారు. గంజాయి మత్తులో కొంత మంది యువకులు తరుచూ గొడవలకు దిగుతున్నారన్న చర్చ గ్రామంలో జరుగుతుంది. అటువంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

పనిగంటల పెంపు బిల్లు ఉపసంహరించుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు

తాడేపల్లిగూడెం : రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సిఐటియు 9వ పట్టణ మహాసభ సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, కరక వెంకట రావుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మీ ఝాన్సీ, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరయ్యారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసు దేవర రావు జెండా ఆవిష్కరణ చేసి మహాసభను ప్రారంభించారు. అనంతరం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా ఉద్యమ నిర్మాత రుద్రరాజు సత్యనారాయణరాజు(ఆర్ఎస్) చిత్రపటాలకు బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2022 నుండి 2025 వరకు మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ప్రవేశపెట్టగా యూనియన్ సభ్యులు కార్యదర్శి నివేదికను ఆమోదించారు. ఈ పట్టణ మహాసభను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ 2025 డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆయన అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ మార్చి కార్మికులను బానిసలుగా చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే మన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మీ ఝాన్సీ మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 6 గంటలకు తగ్గించాలని రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల పోరాటాలు చేస్తుంటే, దీనికి భిన్నంగా 13 గంటలకు పెంచడం ఎవరి ప్రయోజనాల కోసమో చంద్రబాబు ప్రభుత్వం తెలియజేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈదేశంలో అసంఘిటిత రంగంలో పనిచేసే కార్మికులు 40 కోట్ల మందికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, చిటికిన రాము, యాసరపు ఎర్రి నాయుడు, నరమాల కృష్ణ, జవ్వాది శ్రీను, దేశంశెట్టి సతీష్, వడిసెల శ్రీనివాసరావు, ఏపూరి శ్రీను, కుంచంగి నానాజీ, పెనుమాక శ్రీను, పబ్బాని సురేష్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాసుదేవరావు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

13, 14, 15 తేదీల్లో విజయవాడలో నిరసన కార్యక్రమాలు

విఆర్ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు

ప్రజాశక్తి - నరసాపురం

విఆర్ఎ సమస్యలపై 13, 14, 15 తేదీలలో విజయవాడ అలంకార్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు తెలియజేశారు. విఆర్ఎల సంఘం నరసాపురం మండలం కమిటీ సమావేశం సోమవారం నరసాపురంలో రావూరి మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. లోకేష్ బాబు పాదయాత్రలో ఇచ్చిన హామీలు గాని, అలంకార్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని చేసిన వాగ్దానాలు గాని అమలు కాలేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో విఆర్ఎలు అదనపు పని భారం కూడా వెూనస్తున్నారన్నారు. రాయబారాలు, వినతిపత్రాలు అనేక సందర్భాలలో అందించామన్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో నిరసన కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నామని అన్నారు. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రమోషన్లు అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. 13, 14 తేదీలలో దీక్షలు, 15వ తేదీ ధర్నా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారావు

సిఐటియు మండల కన్వీనర్‌గా రాంబాబు

ప్రజాశక్తి - ఆకివీడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రయివేట్ రంగానికి రెడ్ కార్పెట్ వేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. సిఐటియు మండల మహాసభ సోమవారం సాయంకాలం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ దేశంలో ఉన్న పెద్ద కార్పొరేట్లకు బ్యాంకుల రుణాలు మాఫీ చేసి ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారన్నారు. సామాన్యులను మాత్రం వెంటనే రోడ్డుకి ఈడుస్తున్నారన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని రద్దుచేసి 12 గంటల పనిదినాన్ని అమలు చేయాలని కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారని, దీన్ని వ్యతిరేకిస్తూ రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడతామని అన్నారు. కేంద్రంలో మోడీ విధానాలు ఎండగడతామని ఈ సభలో తీర్మానించారు. అనంతరం ఈ నూతన కమిటీ ఎంపిక జరిగింది. మండల కన్వీనర్‌గా బొడ్డుపల్లి రాంబాబు, కో కన్వీనర్లుగా కడగల తవిటినాయుడు, పెంకి అప్పారావు, కమిటీ సభ్యులుగా బొర్రా శ్రీను, బర్నాల అప్పలనాయుడు, ఇరానీ దేవి, మోటుపల్లి ధనరాజు, ఎస్‌కె.బాజీ, తోట పద్మ, కన్యాకుమారి, అల్లాడి లక్ష్మీనారాయణమ్మ, బత్తిలి పార్వతితో సహా మొత్తం 19 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది.

అన్న సమారాధనకు స్థలాన్ని కేటాయించాలి

ఆలయ ఛైర్మన్ బోధనపు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

అన్నసమారాధనలో పాల్గొన్న యాత్రికులు

జువ్వలపాలెంలో కనకదుర్గ అమ్మవారి నవరాత్రి తదితర ఉత్సవాలు నిర్వహించుకునేందుకు, అన్న సమారాధన కార్యక్రమాలు జరుపుకునేందుకు తగినంత స్థలాన్ని కేటాయించాలని గోకరాజు నాగరాజును ఆలయ ఛైర్మన్ బోధనపు వెంకటేశ్వరరావు కోరారు. జువ్వలపాలెంలో సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది యాత్రికులు అన్నసమారాధనకు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు రామకృష్ణంరాజు, గోకరాజు నాగరాజు, గోకరాజు గణపతిరాజు, చంపాటి రామకృష్ణంరాజు, కఠారి లక్ష్మీపతి రాజు, జెవి, ముందుడి సురేష్ రాజు, గండికోట నరసింహమూర్తి, బి. రాంబాబు, బోధనపు కన్నయ్య, జి.కనకం, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

తాడేరు సొసైటీ ఛైర్మన్ సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - భీమవరం టౌన్



కొట్టు సురేష్‌ను సన్మానిస్తున్న త్రిమూర్తులు

తాడేరు సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొట్టు సురేష్(మమ్మీ)కు సోమవారం ఘన సన్మానం జరిగింది. కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు ఈ సందర్భంగా కొట్టు సురేష్‌ని ప్రత్యేకంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ కొట్టు సురేష్ ప్రజాసేవలో విశేష అనుభవం ఉందని కొనియాడారు. ఆయన నేతృత్వంలో తాడేరు సొసైటీ బ్యాంక్ మరింత అభివృద్ధి సాధిస్తుందని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. కొట్టు సురేష్ నాయకత్వంలో సొసైటీ సభ్యులకు, స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేరు సొసైటీ డైరెక్టర్లు, టిడిపి నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, విన్నకోట వినయ్, కాపా అమర్‌బాబు, మద్దుల సాయిరాం, గోలగాని దుర్గారావుతో పాటు స్థానిక నాయకులు, అభిమానం గల వ్యక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొట్టు సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పదేళ్లకు తెరుచుకున్న సొసైటీ సేఫ్ లాకర్లు

సొసైటీ త్రిసభ్యుల కృషికి రైతుల ప్రశంసలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

లాకర్లు తెరుస్తున్న అధికారులు

గత పది ఏండ్ల నుండి స్థానిక పెనుమంట్ర విశాల సహకార సంఘంలో మూత పడి ఉన్న సేఫ్ లాకర్లు సోమవారం మధ్యాహ్నం తెరుచుకున్నాయి. ఇంతకాలం పాత సంఘ సెక్రటరీపై వచ్చిన ఆరోపణల వల్ల ఈ లాకర్లు మూతపడటంతో సంఘంలోని సభ్యులుగా ఉన్న రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల నూతనంగా వచ్చిన సొసైటీ ఛైర్మన్ జవ్వాది సురేష్, త్రి సభ్యులు సత్తి నాగేశ్వర రెడ్డి, పి.విజయ రమేష్ కృషి చేసి, ఇక్కడి లాకర్లను మెంబర్లకు అందుబాటులోకి తెచ్చారు. ఈ లాకర్లను సభ్యులకు ఉపయోగంలోకి పెట్టేందుకు, సంఘంలో కొత్తగా పెనుమంట్ర శాఖ సెంట్రల్ బ్యాంక్ ఏలూరు వారి ద్వారా సెంట్రల్ బ్యాంక్ ఏలూరు శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. లాకర్లు తెరిచిన సమయంలో పెనుమంట్ర తహశీల్దార్, ఎస్ఐ స్వప్న, సంఘ సెక్రటరీ, సెంట్రల్ బ్యాంక్ సూపర్‌వైజర్, మండల లెవల్ ఆఫీసర్, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు. సొసైటీ లాకర్లను తెరిపించడంలో కృషిచేసిన సొసైటీ త్రిసభ్యులను రైతులు అభినందించారు. సహకార సంఘం ఎంఎల్ఓ ఎం.ఎం.విహెమాన్, సూపర్‌వైజర్ పులేటి రాంబాబు, సొసైటీ కార్యదర్శి కె.వెంకటేష్ పాల్గొన్నారు.

ఎంటియు 1318 వరి రకం సాగులో శ్రద్ధ వహించాలి

ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ బి.సహదేవ రెడ్డి

పెనుమంట్ర : ఎంటియు 1318 వరి రకం సాగులో రైతులు శ్రద్ధ వహించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ బి.సహదేవ రెడ్డి అన్నారు. ప్రస్తుతం సార్వాలో సాగుచేస్తున్న పిఆర్ 126 రకం కోతలు జరుగుతుండగా, మిగిలిన ప్రాంతాల్లో పిలకలు కట్టే దశనుండి చిరుపొట్ట దశలో ఉందని తెలిపారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో ఆరోగ్యంగా ఉండగా, అక్కడక్కడా ఆకు ముడత, బాక్టీరియా ఆకు ఎండు తెగులు, దోమ పోటు ఆశించినట్లుగా గుర్తించామని తెలిపారు. జిల్లాలోని ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తున్న ఎంటియు 1318 రకం పూత దశలో ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే మాని పండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున, ముందు జాగ్రత్త చర్యగా చిరు పొట్ట దశలో ఒకసారి, 50 శాతం పూత దశలో ఒకసారి లీటరు నీటికి 1.0 మి.లీ ప్రోపికొనజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత దశలో మధ్యాహ్నం పిచికారీ చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను కోరారు. అంతేకాక జిల్లాలో చాలా ప్రాంతాలలో ఎలుకల సమస్య ఎక్కువగా ఉన్నందున ఈ దశలో పాటించవలసిన నివారణ పద్ధతుల గురించి వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని శాస్త్రవేత్తలను కోరారు. జిల్లాలో ఖరీఫ్ లో ముంపుకు గురైన ప్రాంతాల్లో అక్టోబర్ మాసంలో కాకుండా నవంబర్ 15 తరువాత నారుపోసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. త్వరగా అక్టోబరులో ఊకుమడులు పోస్తే నారు చలి ప్రభావానికి గురై ఎదుగుదల ఉండదని తెలిపారు. డాక్టర్ ఎం.గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద ఈ సంవత్సరం వరి విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. దాళ్వా రకాలైన ఎంటియు 1293, ఎంటియు 1282 రకాలు నవంబర్ నెలాఖరులోగా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారే చిరు సంచి రకం ఎంటియు 1426 కూడా కొద్ది మొత్తంలో రైతులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వారి డివిజన్లలో సాగుచేస్తున్న విరుసంచి రకాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటి పనితీరు శాస్త్రవేత్తలకు తెలియజేయాలని ఆమె కోరారు.

పిపిపి విధానం ఆమోదయోగ్యం : ఎంఎల్ఎ

తణుకు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీపుల్స్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానం ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైనదని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఎక్కువ ఉచిత సీట్లు, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ వైద్యం అందించడం ఉద్దేశ్యంగా ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి తప్పు సద్విమర్శలు చేస్తున్నారని అన్నారు. పిపిపి విధానం సర్వత్రా ఆమోదయోగ్యమైనదన్నారు. పిపిపి మోడల్ కారణంగా కలిగే విస్తృత ప్రయోజనాల గురించి ప్రపంచమంతా తెలిసిందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానాన్ని అన్ని దేశాల్లో అనుసరించడం అభినందనీయమని ఎంఎల్ఎ రాధాకృష్ణ పేర్కొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఇరుకు రోడ్డు.. తప్పని పాట్లు..!

నిత్యం వాహనాల రద్దీతో ప్రజల ఇబ్బందులు

గాంధీబొమ్మ కూడలిలో వాహనాల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ప్రతిరోజూ పలు పర్యాయాలు నిత్యావసర సామగ్రి కొనుగోలు, ఇతర అవసరాల నిమిత్తం మొగల్తూరు వస్తుంటారు. దీంతోపాటు ఉదయం, సాయంత్రం సమయంలో పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు అక్కడ నుంచి ఇళ్లకు విద్యార్థులను తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చే వాహనాలు, బస్సులు వస్తుండటంతో పాతకాలువ కూడలి, ఆ ప్రాంతం నుంచి గాంధీబొమ్మ కూడలి, మసీదు సెంటరు వరకూ రద్దీ నెలకుంటుంది.

నిలిపేందుకు జాగా లేక..

రోడ్డు పునర్నిర్మాణంలో భాగంగా రెండేళ్ల కిందట రహదారి ఎత్తు పెంచారు. వెడల్పు తగ్గించారు. ఆ రహదారిపై వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో తప్పుకునే అవకాశం ఉండటం లేదు. ఆయా వ్యాపార దుకాణాల వద్ద కొనుగోలు దారులు వారి వాహనాలు నిలుపుకునే జాగా లేకపోవడంతో వారంతా వాహనాలను రహదారికి అడ్డుగా నిలిపుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో నాలుగు రోడ్లు కలిసే గాంధీ బొమ్మ కూడలిలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

జి.వాసు, ఎస్ఐ, మొగల్తూరు

మొగల్తూరులో గాంధీబొమ్మ కూడలి, ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతాను. అక్కడ నిత్యం సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నిర్వహణ సక్రమంగా జరిగేలా చూస్తాను. వాహన దారులు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాను. దీనికి ప్రజలు, దుకాణాల నిర్వాహకులు కూడా సహకరించాలి. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు చేపడతాను.

కాలువల పక్కనే చెత్త కుప్పలు..!

- ప్రజారోగ్యానికి ముప్పు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పోడూరు

చించినాడ పంటకాలువలో కలుస్తున్న చెత్త, వ్యర్థాలు

పంటకాలువల పక్కనే యధేచ్ఛగా చెత్తకుప్పలు వెలుస్తుండడంతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోడూరు గ్రామ పరిధిలో చించినాడ పంటకాలువ వెంబడి పలుచోట్ల తరచూ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. కాగా పంచాయతీ కార్మికులు కొద్దిరోజులకు చెత్త తొలగించి శుభ్రం చేస్తున్నారు. అయితే పంట పొలాలకు సాగునీరు అందించడమే కాకుండా అనేక గ్రామాలకు తాగునీరు అందించే ఇటువంటి పంట కాలువల పక్కనే చెత్తకుప్పలు వేయడాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కాలువ పక్కనే చెత్త, దుర్గంధం వెదజల్లే వ్యర్థాలు వేయడం వల్ల అవి కాలువ నీటిలో కలిసి తాగునీరు కలుషితమవుతోందనీ, ప్రజలు రోగాల బారిన పడేలా ఇటువంటి కాలువల పక్కన ఉన్న చెత్తకుప్పలు పరోక్షంగా కారణమవుతున్నాయని కొందరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించే పంటకాలువల పక్కన చెత్త కుప్పలు వేయకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు సూచిస్తున్నారు.

వైఎన్‌లో వర్క్‌షాప్

నరసాపురం : స్థానిక శ్రీవైఎన్ కళాశాల చరిత్ర, రాజకీయ శాస్త్రము, భూగోళ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆధునిక యుగంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం అనే అంశముపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు మల్కీపురం డిగ్రీ కళాశాలకు చెందిన పి.సూర్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం ఏమిటంటే, సమర్ధవంతమైన పాలన, పౌర సంక్షేమం, రాజకీయ ఐక్యతను సాధించడంలో ఈ ప్రాచీన వ్యవస్థ నేటికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేంద్రీకృత పాలనా వ్యవస్థ, బ్యూరోక్రసీ, సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత, సమర్ధవంతమైన న్యాయవ్యవస్థ వంటి మౌర్యుల నమూనాలను ఆధునిక భారతదేశం తన పాలనా నిర్మాణంలో అవలంబించిందన్నారు. పౌర సంక్షేమానికి, ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దీనికి తోడ్పడేలా పన్నుల వసూలు, ప్రజల జనన మరణాల నమోదు, వాణిజ్యం వంటి వివిధ విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఈ వర్క్ షాప్‌నకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు అధ్యక్షత వహించగా, డీన్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, చరిత్ర శాస్త్ర విభాగాధిపతి ఎస్.సోమశేఖర్, డాక్టర్ ఎల్.మల్లేశ్వరరావు, పరిమి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం : పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 37 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులందరూ సహకరించండి

తహశీల్దార్ కె.నాగార్జున

ఉండి : మండల కేంద్రమైన ఉండి గ్రామంలో నిర్వహించే రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. సోమవారం ఉండి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో పాల్గొన్న కావడి నాగార్జున మాట్లాడుతూ త్వరలో నిర్వహించే రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు, అభ్యంతరాలకు తావు లేకుండా ఉండాలంటే రీ సర్వేకు వచ్చే అధికారులకు రైతులందరూ స్వచ్ఛందంగా సహకరించి పత్రాలను అధికారులకు చూపించాలని, తద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని అన్నారు. రీ సర్వేలో కొలతలు, తేడాలు వస్తే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నావళి, విఆర్‌ఒలు అద్దంకి బాబి, వెంకటేశ్వరరావు, సర్వే సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పార్థసారధిని కలిసిన విప్ నాయకర్

నరసాపురం : విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారధిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకర్ నరసాపురం నియోజకవర్గ ప్రజల తరపున మాట్లాడుతూ గృహ పథకాలను వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువచ్చి, అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఇళ్లు అందేలా చూడవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మంత్రి నాయకర్ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించి, తక్షణమే సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

సోమేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్



నూతన పాలకవర్గం చేత ప్రమాణం చేయిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

పరమేశ్వరుని పాదాల చెంత సేవ చేయడమంటే ఎంతో మహాభాగ్యమేనని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. పంచారామ క్షేత్రంలో ఒకటైన భీమవరం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థాన ఛైర్మన్‌గా చింతలపాటి బంగారాజు, సభ్యులుగా బ్రహ్మజ్యోసుల సత్యప్రసాద్, బొచ్చ కృష్ణవేణి, పడమటి లీలాకుమారి, కృష్ణపాల వెంకట రామ, నాగేంద్ర విజయ లక్ష్మీకుమారి సాయి, యార్లగడ్డ రమేష్, బండి రమణ, పోతునూరి శ్యామ్, పెద్దింటి జ్యోతిమయి, కొప్పర్తి విజయ కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ కార్తీకమాసం, శివరాత్రి మహోత్సవాలతో పాటు శివాలయాలకు వచ్చే భక్తులకు పాలకవర్గ సభ్యులు మెరుగైన సేవలను అందించాలని, దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. శివాలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఛైర్మన్ చింతలపాటి బంగారాజు మాట్లాడుతూ మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి ఆలయ పాలకవర్గ సభ్యులను కలుపుకుని పని చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఆలయ ఇఒ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలు వీరే..

రాష్ట్రస్థాయిలో ఒకటి, జిల్లా స్థాయిలో 49 అవార్డులు కైవసం

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛ ఆంధ్రలో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఒకటి, జిల్లాస్థాయిలో 49 అవార్డులు లభించడం జరిగింది. దీనిలో భాగంగా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర స్థాయి అవార్డు కింద బెస్ట్ స్వచ్ఛత వారియర్స్ విభాగంలో బొబ్బిలి రామాంజనేయులను ఎంపిక చేయడం జరిగింది. జిల్లాస్థాయి అవార్డులలో బెస్ట్ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్స్ విభాగంలో ఉండి మండలం వాద్రం గ్రామపంచాయతీకి చెందిన కోనాల ఆనందరావు, మహదేవపట్నం పి.దాసు, తణుకు మండలం తేతలిలో బట్చల రామచంద్రం, పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామపంచాయతీ సోమదుల దుర్గాప్రసాద్, తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లి కండెల్లి రాములు ఎంపికయ్యారు. బెస్ట్ స్వచ్ఛత ఎన్‌జిఒస్ విభాగంలో భీమవరం శ్రీవిజ్ఞాన వేదిక చెరుకువాడ శ్రీరంగ సాయి, ప్రశాంతి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కంతేటి వెంకటరాజు, కాళ్ల మండలం పెద్ద అమిరం పెద్దమి రామ్ వివేకానంద సేవాసమితి డి.నారాయణరాజు ఎంపిక అయ్యారు. బెస్ట్ స్వచ్ఛత వారియర్స్ విభాగంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీకి చెందిన మల్లిపూడి ముత్యాలు, పాలకొల్లు మున్సిపాలిటీ ఆకుల వెంకటరమణ, తణుకు మున్సిపాలిటీ తణుకు లక్ష్మి, ఆకివీడు మున్సిపాలిటీ బంగారు శ్యాంబాబు ఎంపికయ్యారు. స్వచ్ఛ అంగన్వాడీల విభాగంలో తణుకు మండలం కోనాల అంగన్వాడీ డి.లక్ష్మీ సుజాత, నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం అంగన్వాడీ దెందుకూరి విజయలక్ష్మి, పాలకోడేరు మండలం మైపా అంగన్వాడీ కె.జ్యోతిలక్ష్మి, భీమవరం మండలం రాయలం అంగన్వాడీ సిహెచ్.మహాలక్ష్మి, ఇనుమంత్ర మండలం సోమరాజు, ఇల్లిందలపర్రు అంగన్వాడీ దొమ్మేటి కనకదుర్గ ఎంపిక అయ్యారు. బెస్ట్ బస్ స్టేషన్స్ విభాగంలో నరసాపురం బస్‌స్టేషన్ ఎంపికైంది. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో నెల్లిమర్ల నగర పంచాయతీ, నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం, చిన్న అమిరం గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో సిద్ధాపురం గ్రామపంచాయతీ, తేతలి, వేంద్ర, వాంద్రం, విస్సాకోడేరు గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయి. స్వచ్ఛ ప్రభుత్వ హాస్పిటల్స్ విభాగంలో లంకలకోడేరు పిహెచ్‌సి, తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, జిఎడి వెంప ఉన్నాయి. స్వచ్ఛ వసతి గృహాల విభాగంలో నరసాపురం ఎస్‌డబ్ల్యు కాలేజ్ బాయ్స్ హాస్టల్, గవర్నమెంట్ బిసి బాయ్స్ హాస్టల్ ఉన్నాయి. స్వచ్ఛ పరిశ్రమల విభాగంలో జగదీష్ మెరైన్స్ ప్రయివేట్ లిమిటెడ్, తుందుర్రు గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్ ఉన్నాయి. స్వచ్ఛ మున్సిపాలిటీస్ విభాగంలో భీమవరం మున్సిపాలిటీ ఎంపికైంది. స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ విభాగంలో ఆచంట మండలం పెనుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం ఎంపికైంది. స్వచ్ఛ రైతు బజారుల విభాగంలో అత్తిలి రైతు బజార్ ఎంపికైంది. స్వచ్ఛ స్కూల్స్ విభాగంలో అత్తిలి గర్ల్స్ హై స్కూల్, వీరవాసరం జెడ్‌పిహెచ్ స్కూల్, పాలకోడేరు జెడ్‌పిహెచ్ స్కూల్, భీమవరం జెఎల్‌బి మున్సిపల్ హై స్కూల్, వెంకట్రావు పాలెం ఎంపిపి స్కూల్ ఎంపికయ్యాయి. స్వచ్ఛ ఎస్‌ఎల్‌ఎఫ్ఎస్ విభాగంలో పాలకొల్లు మండలం క్రిస్టియన్ పేట, తాడేపల్లిగూడెం మండలం ఓల్డ్ టౌన్ హరిజనవాడ, నరసాపురం మండలం అరుంధతి పేట ఎంపికయ్యాయి. స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్ విభాగంలో చిన్నమిల్లిపాడు, గొల్లలకోడేరు, గొల్లవాని తిప్ప, కొమ్మర, సీతారామపురం నార్త్ ఎంపికయ్యాయి.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సమాజంలో అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో గొప్పదని, తల్లిదండ్రులు జన్మనిచ్చి పెంచి పెద్ద చేస్తే ఉపాధ్యాయులు వీరిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతారన్నారు. తద్వారా ఆదర్శవంతమైన ఉత్తమ సమాజం ఏర్పడుతుందని అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పూలపల్లి బైపాస్ రోడ్‌లో లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో ఘనంగా జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 120 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను మంత్రి రామానాయుడు సత్కరించారు. ఆయన గజమాల వేసి సాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా గత 14 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఇంజనీరు, సైంటిస్టు, డాక్టరు, రాజకీయవేత్తలను తయారు చేసేది ఒక్క ఉపాధ్యాయులేనని, అందువల్లనే ఉపాధ్యాయులంటే ఎంతో గౌరవమని తెలిపారు. తాను కూడా రాజకీయాలకు రాక ముందు నరసాపురం వైఎన్ కళాశాలలో అధ్యాపకునిగా పది సంవత్సరాల పాటు పని చేశానన్నారు. తాను ఎంఎల్ఎ, మంత్రి అని చెప్పుకునేదానికన్నా అధ్యాపకుని అని చెప్పుకోవడానికే ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి మూడుసార్లు వరుసగా ఎంఎల్ఎగా గెలుపొందాలంటే ఉపాధ్యాయులే కీలకమని, అటువంటి ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్య, ఇబ్బంది వచ్చినా అధికారంలో ఉన్నా, లేకపోయినా మీ వాయిస్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా బాధ్యత దిశగా తీసుకుంటున్నానన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాల విధ్వంసానికి గురిచేయడంతో పాటు అప్పులు చేసి ప్రజలపై జగన్ భారం మోపాడన్నారు. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కలిసి మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలలోను ముందుకు తీసుకెళుతున్నారన్నారు. అటువంటి మంచి ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని కోరారు. నేడు విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను గాడిలో పెట్టి అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఉపాధ్యాయులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రామానాయుడు విందు ఏర్పాటు చేశారు.

బిఆర్ఎంవి హైస్కూల్‌లో పనిచేస్తున్న అంకాని శ్రీనివాసరావు, సిహెచ్.మంగతాయారు, కేశవరపు వెంకట పద్మావతిలను అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ధర్మారావు ఫౌండేషన్ ద్వారా మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సన్మానంతో తమ బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ధ్యేయంగా పనిచేస్తామని ఉపాధ్యాయులు తెలియజేశారు. విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా భావించి వారు విద్యలో, వికాసంలో మరింత ముందుకు వెళ్లేలా కృషిచేస్తామని తెలియజేశారు.

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ఎపిఒ లంకపల్లి ఒమేగా రాజు

ఉండి : ఉపాధి కూలీలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఉండి ఎపిఒ లంకపల్లి ఒమేగా రాజు అన్నారు. సోమవారం ఉండి మండలం చినపుల్లేరు శివారు తల్లమ్మచెరువులో పెదపుల్లేరు, చిన్నపుల్లేరు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలకు ఇకెవైసిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లంకపల్లి ఒమేగా రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ప్రక్షాళనలో భాగంగా ప్రతి శ్రామికుడు వారి ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ తీసుకువచ్చిందని, దీనివల్ల ఉపాధి పనులలో మస్తర్లు తేడా లేకుండా, హాజరులో తేడాలు లేకుండా పారదర్శకంగా జరుగుతుందన్నారు.

జిఎస్‌టి 2.0పై అవగాహన

నరసాపురం : పట్టణంలోని 7వ వార్డులో నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక షాపులను సందర్శించి గత ప్రభుత్వ కాలంలో ఉన్న వస్తువుల ధరలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జిఎస్‌టి 2.0 ప్రకారం లభిస్తున్న ధరలతో పోల్చి ప్రజలకు వివరించారు. ప్రజలందరూ కొత్త జిఎస్‌టి విధానం ద్వారా అందుతున్న ప్రయోజనాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, జనసేన టౌన్ పార్టీ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మినహాయించిన జిఎస్‌టి వివరాల గురించి అవగాహన సదస్సు జరిగింది. సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ వికె.మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు కె.అన్నవరం జిఎస్‌టి పన్ను గురించి, కేంద్ర ప్రభుత్వం సడలించి, తగ్గించిన పన్ను శాతం వివరాల గురించి విస్తృతంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు మురళీకృష్ణ, శ్రీనివాసు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టితో అన్ని తరగతుల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెంలో ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల నాగరాజు, మేళం బన్ను తిరుమణి లక్ష్మీనరసింహం, బొల్లా చంటి, పాల రాంబాబు, కౌరు ముత్యాలరావు, సత్తినేని బాబ్జి, డొల్ల రత్నం రాజు, పలువురు నాయకులు ఉన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

13 మంది అరెస్టు

నరసాపురం : భీమవరం మండలం తుందుర్రు శివారులో ఆదివారం రాత్రి కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టి. వెంకట సురేష్ తెలిపారు. పదమూడు మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.23,260 నగదు, 10 మోటార్ సైకిల్స్, 4 ఫోన్స్, 2 కోడిపుంజులు, 2 కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, ముచెర్ల వారి లేఔట్, 12th వార్డు కి చెందిన చేగొండి సతీష్ కుమార్, S/o. స్వామి నాయుడు అను నా యొక్క ఒరిజినల్ **7867/2011** నెంబర్ గల డీడ్ డాక్యుమెంట్స్ పడిపోయినవి. ది 21-09-2025 తేదీన నా ఇంటి వద్ద నుంచి **7867/2011** నెంబర్ గల ఒరిజినల్ డీడ్ డాక్యుమెంట్స్ తీసుకొని పాలకొల్లు సెంటర్ కి జిరాక్స్ తీపించు నిమిత్తం నా యొక్క మోటారు సైకిల్ మీద వెళ్ళు చుండగా, దారి మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కి తెలియజేయగలరు.

చేగొండి సతీష్ కుమార్
S/o. స్వామి నాయుడు
D.No: 27-1-101/A
ముచెర్ల వారి లేఅవుట్
పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

దావా సమన్లు (Or. 5 R. 1 & 5)
చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
O.S.No. 33/2025

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, చింతగుంపల్లి,
రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్ .....వాది
మరియు
M/s Satya Granites & Exports,
రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ కల్లపల్లి రామలక్ష్మి .....ప్రతివాది

To
M/s Satya Granites & Exports, రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ కల్లపల్లి రామలక్ష్మి, W/o తరుణ్, 31 సం.లు, నివాసం ఇసుకవాగు సెంటర్. అంకమ్మ గుడి ప్రక్కన, ఒంగోలు,
ప్రస్తుత నివాసం : డోర్ నెం.4-12, యర్రావుల వీధి, చేబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాని వాది అయిన బ్యాంకు వారు ప్రతివాది అయిన నీనుండి బ్యాంకుకు రావలసిన లోను బకాయిని రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు.ఇందు నిమిత్తమై నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.29-10-2025వ తేదిన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి యెదుట స్వయంగా కానీ, లేదా వకీలు ద్వారా కానీ హాజరై మనవి చేసుకొనవలెను, లేనిచో నీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఆదేశాల ప్రకారము
ప్రకటన జారీ చేయువారు
బండారుపల్లి హేమంత కుమార్,
బి.కాం, బి. యల్.
అడ్వకేట్ & నోటరి (భారత ప్రభుత్వం)
చర్చి కంపౌండ్, చీరాల 523 157
సెల్ : 9440242350.